ఇస్రోలో చేరతారా?

భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో ఉద్యోగం చాలా విలువైనదిగా చెప్పుకోవచ్చు. ఈ సంస్థలో సైంటిస్ట్/ఇంజినీర్ ఉద్యోగాలు అత్యంత ముఖ్యమైనవి. ఇస్రో చేపట్టే కీలక వ్యవహారాల్లో వీరు భాగం కావడమే ఇందుకు కారణం. ఇందులో పాలు పంచుకునే అవకాశమి ప్పుడొచ్చింది. ఈ సంస్థ తాజాగా 303 సైంటిస్ట్/ఇంజినీర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలచేసింది. బీటెక్ విద్యార్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష, ఇంటర్వ్యూతో నియామకాలు చేపడతారు.

సమాజాభివృద్ధిలో అంతరిక్ష పరిజ్ఞానం కీలకం. ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపడం, వాటిని పర్యవేక్షించడం తదితర ముఖ్య విధులను ఇస్రోలో పనిచేసే సైంటిస్టు/ఇంజినీర్లు పర్యవేక్షిస్తారు. వీరికి గ్రూప్-ఎ హోదా దక్కుతుంది. ఈ పోస్టుల్లో చేరినవారు లెవెల్-10 వేతనం అందుకోవచ్చు. రూ.56,100 మూలవేతనానికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, టీఏ, ఇతర ప్రోత్సాహకాలు ఉంటాయి. అందువల్ల ఉద్యోగంలో చేరిన మొదటి నెల నుంచే రూ.లక్షకు పైగా జీతం పొందవచ్చు. దశలవారీగా భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చు.

పరీక్ష, ఇంటర్వ్యూ..

నియామక పరీక్షను దేశవ్యాప్తంగా 11 కేంద్రాల్లో నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం హైదరాబాద్‌లో ఉంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు. మొత్తం వంద మార్కులు. ఇందులో రెండు భాగాలు ఉన్నాయి.
పార్ట్-ఎ: ఇందులో 80 ప్రశ్నలు వస్తాయి. ఇవి ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. వీటిని అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న ఇంజినీరింగ్ బ్రాంచీ నుంచే అడుగుతారు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. తప్పు సమాధానానికి 1/3 మార్కు తగ్గిస్తారు.
పార్ట్-బి: ఆప్టిట్యూడ్/ఎబిలిటీ టెస్టు. 15 ప్రశ్నలు. ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. వీటికి 20 మార్కులు. రుణాత్మక మార్కులు లేవు. న్యూమరికల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డయాగ్రమేటిక్ రీజనింగ్, డిడక్టివ్ రీజనింగ్‌ల్లో ప్రశ్నలు అడుగుతారు.
ఇంటర్వ్యూ: పరీక్షలో చూపిన ప్రతిభతో షార్ట్‌లిస్ట్ చేసి.. ఒక్కో పోస్టుకు ఐదుగురిని ఇంటర్వ్యూకు పిలుస్తారు. దీనికి పంద మార్కులు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ పత్రాలతో వెళ్లాలి. సెకండ్ క్లాస్ రైలు ఛార్జీలు చెల్లిస్తారు.
తుది నియామకం: పరీక్ష, ఇంటర్వ్యూలకు సమాన వెయిటేజీ ఉంటుంది. పరీక్షలో అర్హత సాధించడానికి జనరల్ అభ్యర్థులు పార్ట్-ఎ, బిల్లో విడిగా 50 శాతం మార్కులు పొందాలి. రిజర్వేషన్ ఉన్నవారికి 40 శాతం తప్ప నిసరి. ఇంటర్వ్యూలో అర్హత కోసం జనరల్ అభ్యర్థులు 50, మిగిలినవారు 40 మార్కులు సాధించాలి. పరీక్ష, ఇంటర్వ్యూల్లో కలిపి జనరల్ అభ్యర్థులు 60, మిగిలినవారు 50 శాతం మార్కులు పొందాలి. ఇలా కటాఫ్‌లో నిలిచినవారి జాబితా నుంచి.. మెరిట్, రిజర్వేషన్లు అనుసరించి, ఉద్యోగంలోకి తీసుకుంటారు. వీరు ఇస్రో కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తారు.

సన్నద్ధత

ఈసారి పరీక్ష విధానం మారింది. అందువల్ల పాత ప్రశ్నపత్రాలను పూర్తి ప్రామాణికంగా తీసుకోలేము. అయితే పార్ట్-ఎలో 80 ప్రశ్నలు బీటెక్ బ్రాంచీల నుంచే వస్తాయి. అభ్యర్థులు తమ బ్రాంచి పాఠ్యపుస్తకాలు ముందు బాగా చదవాలి. అనంతరం గేట్ పాతప్రశ్నపత్రాలు బాగా సాధన చేయాలి. ఆ తర్వాత వీలైనన్ని గేట్ మాక్ టెస్టులు రాయాలి. సబ్జెక్టుపై గట్టి పట్టున్నవారు విజయం సాధించడానికి ఎక్కువ అవకాశం ఉంది. పార్ట్-బి కోసం ఏదైనా రీజనింగ్ పుస్తకాన్ని తీసుకుని వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.
పార్ట్-ఎలో రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియనివాటిని వదిలేయడమే మంచిది.

ముఖ్య సమాచారం

పోస్టు: సైంటిస్ట్/ఇంజినీర్
ఖాళీలు: 303. విభాగాలవారీగా.. ఎలక్ట్రానిక్స్ 90, మెకానికల్ 163, కంప్యూటర్ సైన్స్ 47, ఎలక్ట్రానిక్స్ అటానమస్ బాడీ 2, కంప్యూటర్ సైన్స్ అటానమస్ బాడీ 1.
అర్హత: బీఈ/బీటెక్‌లో సంబంధిత/అనుబంధ బ్రాంచీలో 65 శాతం మార్కులు లేదా 10కి 6.84 సీజీపీఏ ఉండాలి.
వయసు: జూన్ 14 నాటికి 28 ఏళ్లలోపు ఉండాలి. దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌కు సడలింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 14
పరీక్ష ఫీజు: రూ.250.
వెబ్‌సైట్: https://www.isro.gov.in/Careers.html

బ్యాంకింగ్ టెక్నాలజీలో పీజీ డిప్లొమా

ఆర్థిక సంస్థలకు టెక్నాలజీనే ఆక్సిజన్. నాణ్యమైన సేవలు అందించడం, ఎలాంటి సైబర్ దాడులు జరగకుండా చూడటంలో సాంకేతికతే దివ్యాస్త్రం. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞానం అందించే సంస్థలూ, మానవ వనరులూ అనివార్యం. ఆ దిశగా ఆలోచించిన ఆర్‌బీఐ.. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రిసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీని హైదరాబాద్‌లో నెలకొల్పింది. ఈ సంస్థలో పీజీ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ కోర్సు అందిస్తున్నారు. ఇందులో ప్రవేశానికి ప్రకటన వెలువడింది.



వ్యవహారాలన్నీ సులువుగా, సజావుగా, కచ్చితత్వంతో, పరిమిత వనరులతో పూర్తి కావడంలో డిజిటల్ టెక్నాలజీ దోహదపడుతోంది. బ్యాంకులు దీన్ని అందిపుచ్చుకునేందుకు 1996లో ఐడీఆర్‌బీటీని హైదరాబాద్‌లో మాసబ్ ట్యాంకు ఎన్ఎండీసీ సమీపంలో ఆర్‌బీఐ నెలకొల్పింది. ఈ సంస్థ భారతీయ బ్యాంకులు, ఆర్థిక విభాగాలకు అవసరమైన సాంకేతికతపై శిక్షణ అందించడంతోపాటు ఆ రంగాలకు అవసరమైన డిజిటల్ టెక్నాలజీపై పరిశోధనలు నిర్వహిస్తోంది. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడం, బ్యాంకులకు నిర్వహణ ఖర్చులు తగ్గించడం, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు లాభదాయకంగా మారడం దిశగా రూపొందించిందే బ్యాంకింగ్ టెక్నాలజీ పీజీ డిప్లొమా కోర్సు. దీన్ని 2016 నుంచి అందిస్తున్నారు. ప్రస్తుతం ఏడో బ్యాచ్‌లో ప్రవేశానికి ప్రకటన వెలువడింది. జులై నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ఈ కోర్సులో చేరినవారు బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు అవసరమైన సాంకేతికాంశాలపై మేటి శిక్షణను సొంతం చేసుకోవచ్చు. కోర్సు చివరలో ప్రాంగణ నియామకాల ద్వారా ఉద్యోగాన్నీ అందుకోవచ్చు.

ఏడాది వ్యవధితో...

కోర్సును ఫుల్ టైం విధానంలో ఏడాది వ్యవధితో నడుపుతున్నారు. ఇందులో భాగంగా సాంకేతిక వినియోగం, సమన్వయం, నిర్వహణల గురించి తెలుపుతారు. మారుతోన్న సాంకేతికత బ్యాంకింగ్ రంగానికి ఎలా అనువర్తించాలో విద్యార్థులు నేర్చుకుంటారు. వీరికి ఆధునిక సాంకేతిక అంశాల్లో శిక్షణ అందించి టెక్నో నిపుణులుగా రూపొందిస్తారు. భారతీయ బ్యాంకింగ్, ఆర్థిక విభాగాలు సాంకేతికంగా ఉన్నత స్థాయిలో ఉండేలా అవసరమైన తర్ఫీదు అందిస్తారు. ఈ రంగాల్లో తాజా సాంకేతిక మార్పులను అనువర్తిస్తారు. నేర్చుకున్న టెక్నాలజీని పలు విధాలుగా ఉపయోగించి బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో ఉత్పాదకత పెరిగేలా శిక్షణ అందిస్తారు. కోర్సులో ప్రాక్టికల్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం ఉంటుంది. ప్రస్తుతం దేశీయ, విదేశీ బ్యాంకులు ఉపయోగిస్తున్న టెక్నాలజీపై అవగాహన కల్పిస్తారు.

ఏం నేర్చుకుంటారు?

కోర్సు ఫీజు వసతితో కలిపి రూ.5 లక్షలు. పన్నులు అదనం. కోర్సు మొత్తం 5 టర్మ్‌ల్లో ఉంటుంది. ఇందులో భాగంగా లెక్చర్లు, సెమినార్లతో పాటు ఐటీ నిపుణులతో ఇంటరాక్టివ్ సెషన్లు ఉంటాయి. సీనియర్ బ్యాంకర్లు, సంస్థకు చెందిన రిసెర్చ్ సెంటర్లు ఇందులో భాగమవుతాయి. క్రిప్టోగ్రఫీ, డేటాబేస్ మేనేజ్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఐవోటీ, బిగ్‌డేటా, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, మొబైల్ బ్యాంకింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, పేమెంట్ సిస్టమ్.. మొదలైనవాటిపై విస్తృత స్థాయిలో తర్ఫీదు అందిస్తారు. చివరి టర్మ్ ప్రాజెక్ట్ వర్క్‌కు కేటాయించారు. ఫ్యాకల్టీ సభ్యుల పర్యవేక్షణలో బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో దీన్ని పూర్తిచేయాలి. కోర్సు విజయవంతంగా పూర్తిచేసుకున్నవారికి పీజీ డిప్లొమా ప్రదానం చేస్తారు. కోర్సు చివరలో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు ఉంటాయి. హెచ్‌డీఎఫ్‌సీ, బంధన్, ఐడీబీఐ, కరూర్ వైశ్య, ఫెడరల్, కోటక్, సౌత్ ఇండియా, ఎన్‌పీసీఐ.. సంస్థలు నియామకాలు చేపడుతున్నాయి. వంద శాతం ప్లేస్‌మెంట్లు లభిస్తున్నాయి. విద్యార్థులకు సగటు వేతనం రూ.9 లక్షలు దక్కుతోంది.

మొత్తం సీట్లు: 40

వీటిలో 10 స్పాన్సర్డ్. వీటిని బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు కేటాయించారు.
అర్హత: కనీసం 60 శాతం మార్కులతో బీటెక్ లేదా ఏదైనా సబ్జెక్ట్‌లో ఫస్ట్ క్లాస్‌తో పీజీ. అయితే వీరు 10+2+4 విధానంలో చదివుండాలి. అలాగే గేట్, క్యాట్, జీమ్యాట్, జీఆర్ఈ, సీమ్యాట్, గ్జాట్, మ్యాట్, ఆత్మా వీటిలో ఏదో ఒక స్కోర్ తప్పనిసరి.
ఎంపిక: దరఖాస్తులను స్కోరు ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. అనంతరం గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ నిర్వహించి వాటిలో చూపిన ప్రతిభతో కోర్సులోకి తీసుకుంటారు.
దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 24
వెబ్‌సైట్: https://www.idrbt.ac.in/index.html

నోటిఫికేషన్స్

ప్రవేశాలు

నిన్- కామన్ ఎంట్రన్స్ టెస్ట్

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (నిన్) పోషణ కోర్సులో ప్రవేశానికి ఉమ్మడి పరీక్ష నిర్వహిస్తోంది. ఎంపికైనవారు రెండేళ్ల పీజీ కోర్సుల్లో చేరవచ్చు.
1. ఎమ్మెస్సీ (అప్లైడ్ న్యూట్రిషన్): 23 సీట్లు
2. ఎమ్మెస్సీ (స్పోర్ట్స్ న్యూట్రిషన్): 17 సీట్లు
అర్హత: ఎంబీబీఎస్ లేదా సంబంధిత విభాగంలో బీఎస్సీ.
వ్యవధి: రెండు సంవత్సరాలు.
ఎంపిక: ప్రవేశ పరీక్ష, కౌన్సెలింగ్ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: జనరల్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీలకు రూ.3000; ఎస్సీ/ ఎస్టీలకు రూ.2700.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27-06-2023.
ప్రవేశ పరీక్ష తేదీ: 05-08-2023.
వెబ్‌సైట్: https://www.nin.res.in/

తెలుగు వర్సిటీలో పీజీ, యూజీ

హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పీజీ, యూజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.
కోర్సులు: శిల్పం, చిత్రలేఖనం, డిజైన్స్, లైబ్రరీ సైన్స్, సంగీతం, రంగస్థలం, నృత్యం, జానపదం, తెలుగు చరిత్ర, పర్యాటకం, భాషాశాస్త్రం, జర్నలిజం, జ్యోతిషం, యోగా తదితర అంశాలలో పీజీ, అండర్ గ్రాడ్యుయేషన్, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు
అర్హత: కోర్సును బట్టి ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 17.06.2023.
ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: 30.06.2023.
వెబ్‌సైట్: https://teluguuniversity.ac.in/

అప్రెంటిస్‌షిప్

నేవల్ డాక్‌యార్డులో...

ముంబయిలోని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ (నేవీ), నేవల్ డాక్‌యార్డ్ అప్రెంటిస్ స్కూల్ కింది ట్రేడుల్లో 281 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ట్రేడులు: ఫిట్టర్, మేసన్ (బీసీ), ఐఅండ్‌సీటీఎస్ఎం, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఎలక్ట్రోప్లేటర్, ఫౌండ్రీ మ్యాన్, మెకానిక్ (డీజిల్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఎంఎంటీఎం, మెషినిస్ట్, పెయింటర్, ప్యాటర్న్ మేకర్, మెకానిక్ ఆర్‌అండ్ ఏసీ, షీట్ మెటల్ వర్కర్, పైప్ ఫిట్టర్, షిప్‌రైట్(వుడ్), టైలర్, వెల్డర్, రిగ్గర్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, షిప్ రైట్ (స్టీల్).
అర్హత: పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ
వయసు: 14- 21 ఏళ్ల మధ్య ఉండాలి.
స్టైపెండ్: నెలకు రూ.6000 నుంచి రూ.7000.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ/ స్కిల్ టెస్ట్ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25-07-2023.
వెబ్‌సైట్: https://apprenticedas.recttindia.in/

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో..

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే.. నాగ్‌పుర్ డివిజన్‌లో 772 ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
ట్రేడ్: ఫిట్టర్, కార్పెంటర్, వెల్డర్, సీవోపీఏ, ఎలక్ట్రీషియన్, స్టెనోగ్రాఫర్, ప్లంబర్, పెయింటర్, వైర్‌మ్యాన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, డీజిల్ మెకానిక్, అప్‌హోయిస్టరర్, మెషినిస్ట్, టర్నర్, డెంటల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్, హాస్పిటల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, టెక్నీషియన్, హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, గ్యాస్ కట్టర్, కేబుల్ జాయింటర్, సెక్రటేరియల్ ప్రాక్టీస్.
అర్హత: పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ.
వయసు: 06-06-2023 నాటికి 15 - 24 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** పదో తరగతి, ఐటీఐ మార్కుల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07-07-2023.
వెబ్‌సైట్: https://secr.indianrailways.gov.in/

వృత్తివిద్యా పాలిటెక్నిక్‌లలో ప్రవేశాలు షురూ!

వ్యవసాయ, అనుబంధ రంగాల పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు గిరాకీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయం విడిగా పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభించాయి.

ఇప్పటికే మత్స్య, పశువైద్య, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ప్రవేశ ప్రకటనలు విడుదల చేయగా.. ఉద్యాన విశ్వవిద్యాలయం త్వరలో ప్రకటన విడుదల చేయనుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ద్వారా సీట్లను భర్తీ చేయనున్నారు. గత రెండేళ్ల నుంచీ డిప్లొమా కోర్సును ఇంటర్మీడియట్‌తో సమానంగా పరిగణించి.. ఉన్నత విద్యామండలి సూచించిన కొన్ని డిగ్రీ కోర్సుల్లోకి ప్రవేశం కల్పిస్తున్నారు.

వ్యవసాయం, పశుపోషణ, ఉద్యాన, మత్స్యశాస్త్రాల్లో నిపుణుల కొరత ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యాన, మత్స్య పశుపోషణపై ఆసక్తి ఉన్న యువతకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఈ కోర్సులను రూపొందించారు. వీటిని పూర్తిచేసినవారికి ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. వ్యవసాయంలో డిప్లొమా పూర్తిచేసినవారికి వ్యవసాయశాఖలో ఏఈవో, ఎంపీఈవో ఉద్యోగాలతో పాటు ప్రైవేటు విత్తన, ఎరువుల సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. పశుసంవర్ధక పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసినవారు పశుసంవర్ధకశాఖలో ఎంపీఈవోలుగా, పశువైద్య సహాయకులుగా చేరవచ్చు. కోళ్ల పరిశ్రమ, దాణా తయారీ కర్మాగారాల్లో ఉద్యోగం సాధించుకోవచ్చు. ఉద్యాన పాలిటెక్నిక్ పూర్తిచేసినవారికి ఉద్యానశాఖలో ఏహెచ్‌వో, ఎంపీఈవోలుగా, ప్రైవేటు విత్తన సంస్థలు, ప్రైవేటు నర్సరీల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి.

పట్టణ, నగర ప్రాంత విద్యార్థులూ అర్హులే

వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాస్త్ర, పశుసంవర్ధక పాలిటెక్నిక్‌లలో ప్రవేశాలు పొందేందుకు గతంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు మాత్రమే అర్హులు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివిన కాలంలో కనీసం నాలుగు సంవత్సరాలైనా నగరపాలిక, పురపాలికేతర ప్రాంతాల్లో చదివిన వారిని మాత్రమే గ్రామీణ ప్రాంత విద్యార్థులుగా పరిగణిస్తారు. పదో తరగతి, దానికి సమానమైన విద్యార్హతలున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది పదో తరగతి మార్కుల ఆధారంగా రాష్ట్రంలోని వ్యవసాయ, అనుబంధ రంగాల పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. గత ఏడాది గ్రేడ్ పాయింట్స్‌తో సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయి. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్నవారు, పదో తరగతి కంపార్టుమెంట్‌లో ఉత్తీర్ణులైనవారు సైతం దరఖాస్తు చేయవచ్చు. ఇంటర్మీడియట్ పూర్తయినవారు అనర్హులు. దరఖాస్తుదారుల వయసు 15-22 సంవత్సరాలు ఉండాలి. రాష్ట్రస్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహించి రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లను కేటాయిస్తారు.

శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం: తిరుపతి కేంద్రంగా నిర్వహిస్తున్న ఈ పశువైద్య విశ్వవిద్యాలయం పశుసంవర్ధకంలో డిప్లొమా కోర్సును అందిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 10 విశ్వవిద్యాలయ, 12 విశ్వవిద్యాలయ గుర్తింపు పొందిన ప్రైవేటు పశుసంవర్ధక పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. మొత్తం 990 పాలిటెక్నిక్ సీట్లు భర్తీ చేయనున్నారు. డెయిరీ టెక్నాలజీలో ఉన్న ప్రైవేటు పాలిటెక్నిక్‌లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు నిలిపివేశారు. www.svvu.edu.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు విధానం, సీట్లు, కళాశాలలు ఉన్న ప్రాంతాల వివరాలు పొందవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ జూన్ 23.

డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం: పశ్చిమ గోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలోని ఈ విశ్వవిద్యాలయం నిర్వహించే నాలుగు ఉద్యాన పాలిటెక్నిక్‌లలో 145 సీట్లు భర్తీ చేస్తున్నారు. అనుబంధ ప్రైవేటు ఉద్యాన పాలిటెక్నిక్‌లు రాష్ట్రవ్యాప్తంగా ఐదు 200 సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. ఉద్యాన విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.drysrhu.edu.in నుంచి వివరాలు పొందవచ్చు. తెలుగు మాధ్యమంలో డిప్లొమా బోధన ఉంటుంది. డిప్లొమా పూర్తయిన వెంటనే హార్టీసెట్ ద్వారా ఏటా నిర్ణీత సంఖ్యలో ఉద్యానశాస్త్ర డిగ్రీలో ప్రవేశాలు కల్పిస్తారు.

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం: ఇది గుంటూరు జిల్లా లాం కేంద్రంగా పని చేస్తోంది. దీని పరిధిలో వ్యవసాయ, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, సేంద్రియ వ్యవసాయం విభాగాల్లో రెండేళ్ల డిప్లొమా కోర్సులను తెలుగు మాధ్యమంలో అందిస్తున్నారు. వ్యవసాయ ఇంజినీరింగ్ కోర్సును మూడేళ్ల కాలపరిమితిలో ప్రవేశపెట్టారు. ఇది ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. విశ్వవిద్యాలయం పరిధిలో 17 వ్యవసాయ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, 51 ప్రైవేటు వ్యవసాయ పాలిటెక్నిక్‌లలో 2340 సీట్లు ఉన్నాయి. విత్తన సాంకేతిక పరిజ్ఞానం విభాగంలో విశ్వవిద్యాలయానికి చెందిన ఒక పాలిటెక్నిక్, ప్రైవేటులో 8 పాలిటెక్నిక్స్ ఉన్నాయి. సేంద్రియ వ్యవసాయంలో విశ్వవిద్యాలయ పాలిటెక్నిక్ ఒకటి, అనుబంధ ప్రైవేటు పాలిటెక్నిక్ మరొకటి ఉంది. మూడేళ్ల వ్యవసాయ ఇంజినీరింగ్‌లో విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న రెండు పాలిటెక్నిక్ కళాశాలలతోపాటు 11 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలూ ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. అన్‌లైన్‌లో జూన్ 30లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని విభాగాల్లో పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులకు అగ్రిసెట్ నిర్వహించి నిర్ణీత సంఖ్యలో వ్యవసాయ డిగ్రీలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. వివరాల కోసం angrau.ac.in సైట్‌ను సందర్శించవచ్చు.

తెలంగాణలో..

తెలంగాణ రాష్ట్రంలోని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో మహబూబ్‌నగర్, కరీంనగర్, సిద్దిపేటల్లోని పాలిటెక్నిక్ కళాశాలల్లో 30 చొప్పున, మామునూర్ పాలిటెక్నిక్‌లో 20 సీట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భావదేవరపల్లె పాలిటెక్నిక్‌లో తెలంగాణ కోటాగా 11 సీట్లు భర్తీ చేస్తారు. తెలంగాణలో పశుసంవర్ధక శాఖలో ప్రైవేటు పాలిటెక్నిక్‌లు లేవు. బోధన తెలుగు మాధ్యమంలో ఉంటుంది. తెలంగాణ పాలిసెట్-2023 ర్యాంకులతో సీట్లు కేటాయిస్తారు. జూన్ 19 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
వెబ్‌సైట్: www.tsvu.edu.in

- కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ఆదిలాబాద్, రామగిరిఖిల్లాల్లోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల్లో 80 సీట్లున్నాయి. విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న మరో మూడు ప్రైవేటు కళాశాలల్లో 120 సీట్లున్నాయి. తెలంగాణ పాలిసెట్ ర్యాంకులతో సీట్లను భర్తీ చేస్తారు.
- ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో 240 సీట్లు, అనుబంధ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 600 సీట్లు ఉన్నాయి. వ్యవసాయ పాలిటెక్నిక్‌లు, ఒక విత్తన సాంకేతిక, ఒక వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. తెలంగాణ పాలిసెట్ ర్యాంకులతో ప్రవేశాలు కల్పించనున్నారు. జూన్ 26లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
వెబ్‌సైట్: www.diploma.pjtsau.ac.in

ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయం

ఈ ఏడాది నుంచి ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడిన మత్స్య విశ్వవిద్యాలయం మత్స్య పాలిటెక్నిక్‌ల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది. అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో ఈ నెల 12లోపు, అపరాధ రుసుముతో 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయ నిర్వహణలోని పాలిటెక్నిక్‌లో 55 సీట్లు, విశ్వవిద్యాలయ గుర్తింపుతో నడుస్తున్న 8 పాలిటెక్నిక్‌లలో 440 సీట్లు ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. పూర్తి వివరాల కోసం www.apfu.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

- పసుపులేటి వేణుగోపాల్,న్యూస్‌టుడే-తిరుపతి (పశువైద్య విశ్వవిద్యాలయం)

విద్యార్థులు ఒక్కోసారి పరీక్షల్లో ఫెయిలవుతుంటారు. ఆటపాటలూ, క్విజ్ పోటీల్లో అన్ని సార్లూ గెలవలేరు. అయితే...కొందరు తమ ఓటమిని పదేపదే గుర్తు చేసుకుని బాధపడిపోతుంటారు. ఇది సరైన పద్ధతేనా?

పదేపదే అదే!

ప్రేరణ

తెలుగు లెక్చరర్ అభిరామ్‌ను విద్యార్థులందరూ ఎంతో అభిమానిస్తారు. ఎందుకంటే ఆయన పాఠాలను మాత్రమే కాకుండా.. జీవిత పాఠాలనూ బోధిస్తుంటారు.

ఒకసారి కొంతమంది విద్యార్థులు కాలేజీ తరపున క్రికెట్ పోటీలకు వెళ్లారు. పోటీలో ఓడిపోవడంతో డీలాపడిపోయారు. మర్నాడు అన్యమనస్కంగా తరగతిలో పాఠాలు వినసాగారు. వాళ్లను ఉత్సాహపరచాలనే ఉద్దేశంతో అభిరామ్ ఒక జోక్ చెప్పారు. అందరూ భళ్లున నవ్వారు. అదే జోక్‌ను మళ్లీ చెప్పేసరికి తక్కువ మంది మాత్రమే నవ్వారు. అదే జోక్‌ను మూడోసారి చెప్పడంతో ఎవ్వరికీ నవ్వు రాలేదు.

'ఒక జోక్‌ను మళ్లీమళ్లీ చెబితే మీకు నవ్వు రాలేదు. మరి ఓటమిని మాత్రం పదేపదే తలుచు